38.

# పంచ భూతములు పరమాత్మ స్వరూపములే

కోటీశ్వరులకైన కూడు గుడ్డయె గాని
　　బంగారము తిని బ్రతుకలేరు
కాలమే గాకున్న కట్టెయే పాముగు
　　కలసి వచ్చిన మట్టి కనకమగును
పండితుడొకచోట పశువుగా మారును
　　మూర్ఖుండు ఒక తరి మునిగ మారు
ధనవంతు నొకపరి దారిద్ర్య దేవత
　　వరియించి వానితో వరుసలాడు
ప్రాకులాడుటయె గాని ప్రాప్తి లేకున్న
దమ్మిడయిన నీకు దరిన్ రాదు
వద్దు బాబు వద్దురా నరుడ
ఈవిధమైన పెద్ద ఆశ
బుద్ధి కలిగి జీవించుమో పెద్ద మనిషి

ప్రేమస్వరూపులారా!

ఈ విశాలమైన ప్రపంచమునందు అనంతమైన జన సమూహమందు మానవజన్మ చాలా ఉత్తమమైన జన్మము. అనేక జన్మల పుణ్యఫలము పోగుచేసి అందుకున్న అదృష్ట జీవితము ఈ మానవ జీవితము. ఒక్క మానవ జీవితమందే యీ విశాల ప్రపంచమంతయు సూక్ష్మస్వరూపమై యిమిడి ఉన్నది. ఒక చిన్న గ్రామఫోను ప్లేటులో అనేక పాటలు, మాటలు, పద్యములు, డైలాగులు అన్నీ కలిగిఉంటాయి. కానీ ఆ ప్లేటును తీసుకొని చెవి దగ్గర పెట్టుకుంటే ఏ శబ్దము వినిపించదు. కన్నులముందు పెట్టుకున్నప్పుడు ఒక్క అక్షరమైనా కనుపించదు. ఆ ట్యూన్స్ ఏమిటో ఎవరికి అర్థము కాదు. ప్లేటంతా కేవలం గీతలవలె

sri sathyasai vachanamrutam

కనిపిస్తుంటాయి. కానీ ఆ గీతలపైన పిన్ను పెట్టి విన్నప్పుడు అన్ని పాటలు, అన్ని మాటలు, అన్ని పద్యములు కూడ అన్ని డైలాగులు మనకు సుస్పష్టముగా వినిపిస్తాయి.

**మానవ హృదయమే విశ్వమందిరం**

అదేవిధముగా మానవుని హృదయమందు అనేక జన్మల సంస్కారము గానీ, అనేక జన్మల కర్మఫలములు గానీ ఈ జగత్తునందు మనము చూచిన దృశ్యములు గానీ విన్న వాక్యములు గానీ అన్నీ ఆ హృదయమునందే లీనమై ఉన్నవి. కేవలం resound మాత్రమే కాదు reaction కూడా ఉన్నాది. reflrection కూడా ఉన్నాది. పెద్ద సముద్రాన్ని ఏనాడు నీవు చూస్తివో, ఆ విశాలమైన సముద్రము నీ హృదయములో లీనమై ఉంటున్నాది. ఏ హిమాలయ పర్వతములు నీవు కనులార గాంచితివో ఆ పర్వతములు కూడా నీ హృదయములో ప్రింటు అయి ఉంటున్నవి. ఈ ప్రపంచములో ఏఏ ప్రదేశములు సంచరిస్తిరో ఆ ప్రదేశములన్నీ నీ హృదయమునందే ఉంటున్నవి. ఏతావాతా దీని అంతరార్థము ఏమిటి? ప్రతి మానవుని హృదయమందు విశ్వమంతయు ప్రింటై ఉంటున్నది. కనుక మానవుడు విశ్వవిరాట్ స్వరూపులు. ఇట్టి విశ్వవిరాట్ స్వరూపుడైన మానవుడు తనను అల్పునిగా భావించుకొని కేవలం స్వల్పునిగా విశ్వసించి అనేక విధములైన కష్టములకు కృంగి కృశించి అనేక సుఖములకు ఆనందించి పొంగి పొరలి అనేక మంచి చెడ్డలను అనుభవిస్తున్నాడు. కానీ మానవుడు తన సత్యాన్ని తాను గుర్తించుటకు ప్రయత్నించటం లేదు. తన యొక్క భావాన్ని తాను గుర్తించుటకు ఏమాత్రం ప్రయత్నించటం లేదు. విశ్వమంతయు ఎక్కడ సృష్టింపబడినదనే ప్రశ్న వేసినప్పుడు శృతులు దీనికి చక్కని సమాధానము యిస్తున్నవి. నేను అన్న పదము ఎక్కడ పుట్టినదో అక్కడ నుంచే ఈ శబ్దము ప్రారంభమవుతున్నది. అదియే హృదయమన్నారు. శృతి యొక్క ప్రమాణము హృదయమే నేను అనే పదమునకు జన్మస్థానమని చెప్పింది. అయితే యీ నేను ఎక్కడ ఉంది. ఈ నేను అనే పదము ఎక్కడ నుండి వచ్చింది. ఎవరికి వారు తన విషయము జ్ఞప్తికి చేసుకున్నప్పుడు ఎవరికి వారు యితరులకు తను పరిచయము చేసుకున్నప్పుడు నేను నేను అనే పదము మొట్టమొదట ఆవిర్భవిస్తుంది. నేను అనే పదము లేని మానవుడే లేడు. నేను అనే స్థానము లేని ప్రదేశమే లేదు. పశుపక్షి మృగాదులకు భాష తెలియదు గానీ

sri sathyasaivachanamrutam

వాటియందు కూడా నేను అనే పదము సంపూర్ణమై నిల్చి ఉంది. ఈ నేను అనేచోట అంతా అహం అనే తత్వములో ఈ హృదయము ఉంది. కాబట్టి హృదయమనేది ఒక్క దేహమందే కాదు. ప్రపంచమంతయు నిండి ఉన్నది.

**సర్వతః పాణిపాదం తత్సర్వతోక్షి శిరోముఖమ్**
**సర్వతః శృతిమల్లోకే సర్వమా వృత్య తిష్ఠతి**

ఎక్కడ చూచినా ఏదేశమునందైనా, ఏకాలమునందైనా ఏ వ్యక్తియైనా ఈ హృదయమనేది లేకుండా ఉండుటకు వీలులేదు. ఈ హృదయమునందు నేను అనే శబ్దము ఆత్మ యొక్క పేరు. కనుక ప్రతి శరీరములో నేను అనేది ఆత్మగా నిల్చి ఉన్నది. యిది బుద్ధితో కూడినదిగా ఉన్నాది.

**బుద్ధి అనగా నేమి?**

ఈ బుద్ధి అంటే ఏమిటని ప్రత్యేకంగా విచారణ చేసినప్పుడు చదువుకున్న వాడుగానీ, చదువులేనివాడు గానీ, మూర్ఖుడుగానీ, మేధాశక్తి గలిగినవాడు గానీ యీ బుద్ధిని విచారణాశక్తి అంటున్నారు. నిత్యానిత్య విషయ పరిశీలనే బుద్ధి యొక్క రూపము అన్నారు. ఇది సరైన ఆన్సరు కాదు. బుద్ధికి తగిన పేరు కాదు ఇది. ఇది కేవలము ప్రాకృతమైన జగత్తునందు, ప్రాకృతమైన భాషలో యిది ఉపయోగపెట్టుకుంటున్నారు. కానీ బుద్ధికి సరైన అర్థము చక్కగా వర్ణించాలి. ఈ బుద్ధికి ఐదు అంశములున్నాయి. ఏమిటి ఈ ఐదు అంశములు? శ్రద్ధ, ఋతము, సత్యము, యోగము, మహత్తత్వము. ఈ ఐదు అంశములుగా కూడినది బుద్ధి. ఇట్టి ఐదుతత్వములతో కూడిన బుద్ధిని కేవలం నిత్యానిత్య విషయ పరిశీలనా శక్తి అని చెప్పటంలో ఎంత చిన్నతనము చేసినట్టవుతుంది. ఈ బుద్ధికి రెండు విధములైన శక్తులున్నాయి. ఇది గాఢవిశ్వాసముతో కూడినది. ఈ విశ్వాసము స్థిరత్వముతో కూడినది. కనుక slow and steady. ఈ రెండింటి శక్తితో కూడినది మొట్టమొదటిది శ్రద్ధ. ఈ శ్రద్ధ తరువాత ఋతం. ఋతము అనగా త్రికరణ శుద్ధితో కూడిన ఋతము నుండి ఆవిర్భవించిన స్వరూపమే సత్యము. యిది వాక్ రూపములో వచ్చినటువంటిది. ఈ సత్యము తరువాత యోగము. ఏమిటి ఈ యోగము. 'యోగం



sri sathyasai vachanamrutam

చిత్తవృత్తి నిరోధకః'. సర్వేంద్రియములను అరికట్టే తత్వము, సర్వేంద్రియములను తాను స్వాధీనము చేసుకున్న తత్వమే ఈ యోగము. తదుపరే మహత్తత్వము. ఈ మహత్తత్వమనగా ఏమిటి? ఇది చాలా పవిత్రమైన స్థితి. ఇది దివ్యమైన స్థితి. ఇది నవ్యమైన స్థితి. దీని స్థితి యిట్టిది, అట్టిది అని ఎవరు వర్ణించలేరు. కనుక శ్రద్ధతో, ఋతముతో, సత్యముతో, యోగముతో, మహత్‌శక్తితో కూడినది యీ బుద్ధి యొక్క స్వరూపము. ఇలాంటి సర్వ శక్తులతో కూడిన బుద్ధిని నిత్యానిత్య విషయ పరిశీలనతో మాత్రమే మనం పోల్చుకున్నప్పుడు బుద్ధిని ఎంత చులకన చేసిన వారౌతాము. కనుక ప్రతి మానవుడు మనస్సు, బుద్ధి, చిత్తము, ఇంద్రియములు అని వర్ణిసుంటారు. ప్రతి పదమునకు సరైన అర్థాన్ని మనం గుర్తించటానికి ప్రయత్నించాలి.

**మనస్తత్వము**

ఈ మనస్తత్వము కూడా అట్టిదే. మనస్సు సంకల్పముల చేరికయే అని అనుకుంటున్నాం. కాదుకాదు. కేవలం సంకల్పములు మాత్రమే కాదు చర్యలు కూడా చేరినదే యీ మనస్సుయొక్క స్వభావము. మనోబుద్ధులు రెండూ ఏకమైనప్పుడు మానవత్వమే శూన్యమైపోతుంది. ఈ శూన్యమైన స్థితియే మోక్షమన్నారు. ఈనాడు మానవుల యొక్క మనోబుద్ధులు ఏకమగుట లేదు. ఈ మనస్సు యొక్క స్వభావము చాలా విచిత్రమైనది. నిరంతరము చంచలమైనది, అస్థిరమైనది. పొగరుబోతు లక్షణము కలిగినది. సర్వత్రా వ్యాపించే లక్షణము కల్గినది. ఇలాంటి మనసును ఎవరు అరికట్టగలరు. ఏదో అరికట్టుకొనుటకు ప్రయత్నిస్తున్నామని భావిస్తున్నారు. ఇది అసాధ్యము. కనుక నీవు మనస్సును అరికట్టుటకు ఏమాత్రము ప్రయత్నము చేయనక్కర లేదు. బుద్ధిని అనుసరించు మనస్సు తనంతతానే నీవెంట పడుతుంది. సుఖంగా స్వాధీనమైపోతుంది. కనుక మనస్సును అరికట్టుకొనే నిమిత్తము సాధనలు చేయటం చాలా పొరపాటు. మనస్సుయొక్క స్వభావము అట్టిది కాదు. చంచలమైనది, అస్థిరమైనది, అశాశ్వతమైనది, అప్రియమైనది. ఇలాంటి మనస్తత్వాన్ని ఏరీతిగా అరికట్ట గలము? ఈ మైండ్‌కి అధిపతి బుద్ధి. ఈ బుద్ధికి అధిపతి ఆత్మ. దానికి అధిపతి లేదు. Master the mind be a master mind అన్నారు. దీనినే ఆత్మ అని పిలుస్తూ వచ్చారు. ఇదియే సత్యమని నిరూపిస్తూ వచ్చారు. Search for

srisathyasaivachanamrutam

truth is search for God. God is truth. ఈవిధమైన తత్వాన్ని మొట్టమొదట గుర్తించుకోవాలి. ప్రత్యక్ష స్వరూపుడైన భగవంతుడు ఈ జగత్తునందు ఎవరంటే సత్యస్వరూపుడే. ఈ సత్యాన్ని నీవు ఆరాధించు. సత్యాన్ని నీవు అనుసరించు. సత్యాన్ని నీవు సాధన చేయి. ఎందుకంటే truth is God. అది ఉన్నది లేదని చెప్పటానికి వీలుకాదు. దేవుడులేదని చెప్పవచ్చుగానీ సత్యములేదని ఎవరూ చెప్పలేరు. ఈ సత్యము సర్వదేశములకు, సర్వమతములకు, సర్వకులములకు, సర్వలింగములకు సమానమైనది. ఇది అమెరికన్ సత్యమని గానీ లేక యిండియన్ సత్యమని గానీ, ఇది కాశ్మీరు సత్యమనిగానీ, యిది పాకిస్తాన్ సత్యమనిగానీ సత్యమును విభేధము చేయుటకు వీలుకాదు. 'ఏకంసత్ విప్రా బహుదా వదంతి.' సత్యం ఒక్కటే. అన్ని దేశముల వారికి, అన్ని కాలముల వారికి, అన్ని తెగల వారికి సత్యం ఒక్కటే. కనుకనే God is one.

**భగవత్తత్వము ప్రేమతత్వము వేరుగావు**

ఒకే భగవంతుడే అనేక రూపనామములతో మనం ఆరాధనలు సల్పుకుంటున్నాం. ఇవన్నీ మన భ్రాంతి నిమిత్తమై. మానవుడు అనాదికాలము నుండి భ్రాంతి స్వరూపుడై నిల్చి ఉండటంచేత ఈ భ్రాంతి కోసం ఇన్ని సాధనలను సల్పుతున్నాడు. ఈ విధమైన భ్రాంతి మానవుని యందుండినంత వరకు బ్రహ్మ మనకు ప్రాప్తించదు. ఏనాడు మానవుని భ్రాంతి నిర్మూలమగునో ఆనాడే బ్రహ్మ ప్రత్యక్షమవుతాడు. ప్రతి చిన్న విషయమందు భ్రాంతిలో అనేక బాధలకు గురౌతున్నాము. కనుక మొట్టమొదట భ్రాంతిని దూరం చేసుకోవాలి. దైవము వేరుగా ఉన్నాడని, తనకంటె భిన్నంగా ఉన్నాడని విశ్వసించటం చాలా పొరపాటు. ఒక్కసారి నీవు భగవంతునితో ఏకమైపోతివా, ఇంక వేరు చేయటానికి వీలుకాదు. నీ కుండలోని నీరంతా తీసుకొని పోయి సముద్రంలో పోయి. నీ కుండ నీరంతా సముద్రరూపాన్ని పొందుతుంది. అయితే తరువాత ఆనీటిని వేరు చేయటానికి వీలవుతుందా! అసాధ్యము. ఒక పండు చక్కగా నమిలి భుజించి మింగావు. ఆ ఫలము తిరిగి ఫలరూపములో తెప్పించుకోటానికి సాధ్యం కాదు. మనం వదలిన గాలి మేఘములో చేరిపోయింది. కానీ మేఘములలో చేరిపోయిన గాలిని తిరిగి తెచ్చుకోటానికి వీలవుతుందా? కాదు కాదు. అదేవిధంగా భగవంతునిలో ఏకమైన ప్రేమతత్వము తిరిగి మనం వెనక్కు

sri sathyasai vachanamrutam

తీయటానికి వీలుకాదు. అది ఎట్లా ఏవిధంగా ఏకం చేయాలి. ఒక దగ్గిర అగ్గి ఉంటున్నాది. మరొక దగ్గర బొగ్గు ఉంటున్నాది. బొగ్గు ఒకచోట అగ్గి ఒకచోట పెట్టినప్పుడు బొగ్గులోకి అగ్ని ప్రవేశించదు. కానీ ఈ అగ్నికి ప్రక్కలోనే బొగ్గు చేర్చినప్పుడు ఈ అగ్ని అంతా బొగ్గులో చేరిపోతుంది. దానిపై గాలి విసిరినప్పుడు బొగ్గు కూడా అగ్ని అయిపోతుంది. దీనినే వేదాంతము నందు 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి' అన్నారు. దైవత్వానికి సమీపంగా పోవాలి మనం. సమీపంగా పోవటమే గాదు. ఆ దైవత్వమును అమితంగా ప్రేమించాలి. ఆ near అను గాలి, dear అను ప్రేమ రెండూ చేరి బ్రహ్మ స్వరూపానికి చేరిపోతాయి. కేవలం దగ్గర ఉండినంత మాత్రమున చాలదు. గాలి విసరాలి. అప్పుడే యీ బొగ్గంతా అగ్ని అయిపోతుంది. అదేవిధముగా దైవత్వానికి సమీపంగా ఉండినంత మాత్రమున చాలదు. ప్రేమతత్వాన్ని కూడా సచ్చిదానంద తత్వములో ఏకం చేయాలి. అప్పుడే ఏకమవుతుంది. 'ఓం ఇత్యేకక్షరం బ్రహ్మ.' ఒకే శబ్దము చేత దైవత్వాన్ని పొందవచ్చును.

**దేహంలోనే అన్ని లోకాలున్నాయి**

ఈనాడు మానవుడు చేసే సర్వసాధనలు కూడ కేవలం భ్రాంతిని తృప్తి చేసే నిమిత్తము చేస్తున్నాడు. దైవం మన హృదయంలో ఎట్లా ఉంటున్నాడు? దేహములో ఎట్లా ఉంటున్నాడు? అని చూస్తే దైవము శిరస్సులో నివసిస్తున్నాడు. శిరస్సునే దైవలోకము అన్నారు. నరలోకము ఎక్కడుంటున్నాది? మన కంఠములో చేరి ఉంటున్నాది. నాగలోకము ఎక్కడుంటున్నాది? నాగలోకం మన హృదయంలో ఉంటున్నాది. దేవలోకము, నరలోకము, నాగలోకము దేహములో నివాసంగా ఉంటున్నాయి. ఇంతటి పవిత్రమైన శరీరాన్ని అనుభవించి కూడ యింత పవిత్రమైన శరీరతత్వాన్ని తెలుసుకోకుండా, జీర్ణించిపోయేది శరీరము అనుకుంటున్నాం. దహించిపోయేది దేహమంటున్నాం కాదుకాదు. దేహము నశించవచ్చు, దేహము జీర్ణముకావచ్చు కానీ దేహి జీర్ణమయ్యేది కాదు.

**దేహము పాంచభౌతికము దేహము కూలక తప్పదెప్పుడున్**
**దేహి నిరామయుండు గణుతింపగ దేహికి చావుపుట్టుకల్**
**మోహనిబంధ బంధనల ముద్రలు లేవు నిజంబు జూడ**

sri sathyasaivachanamrutam

**యా దేహియె దేవదేవుడు వెలుగొందును ఆత్మ రూపుడై మదిన్**

అటువంటి దేవునికి స్థానమైన దేహాన్ని ఎంత దుర్వినియోగం చేసుకుంటున్నారో మీకు మీరే యోచించుకోవచ్చు. తన నివాసమైన స్థానమును దుర్వినియోగం చేసుకుంటున్నారు. దుర్మార్గములో ప్రవేశపెడుతున్నారు. దుర్వ్యసనములకు గురౌతున్నారు. ఈవిధంగా చేసుకొని దైవత్వాన్ని చూడాలంటే ఎలా సాధ్యమవుతుంది? శిరస్సే దేవలోకం. ఎందుకనగా ఆ శిరస్సుయందే శబ్ద రూప రస గంధాధులుంటున్నాయి. నిన్న చెప్పాను 'క్లీం కృష్ణాయ గోవిందాయ గోపీ జనవల్లభాయ స్వాహా' అని ఐదు. ఈ ఐదింటిలో ఏమున్నాయి. క్లీం అదే భూమి. కృష్ణాయ అదే జలము. గోవిందాయ అదే అగ్ని గోపీ జనవల్లభాయ వాయువు. స్వాహా ఆకాశము. ఈ పంచభూతములతో కూడినదే యీ ప్రపంచము కాబట్టి భగవంతుడు ఎక్కడున్నాడంటే పంచభూత స్వరూపుడై ప్రపంచమంతా ఉన్నాడు. **"అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణ స్థితః"** లోపల వెలుపల సర్వత్ర నిండినది భగవత్తత్వము. దివ్యత్వము సర్వత్రా ఉండినదే.

**పంచభూతాలు పంచకోశాలు**

ఈ పంచభూతముల యొక్క తత్వమే మానవుని జీవితతత్వము. ఈ పంచభూతములతత్వాన్ని మనం చక్కగా అర్థం చేసుకోవాలి. ఈ పంచభూతములు పంచకోశములతో చేరి ఉంటున్నాయి అవే అన్నమయ కోశము, ప్రాణమయ కోశము, మనోమయకోశము, ఆనందమయ కోశము, విజ్ఞానమయ కోశము. ఈ ఐదు ఒక్క దేహమందే ఉంటున్నాయి. మానవునియందు విజ్ఞానమయ కోశము ఎంత పవిత్రమైనది. విజ్ఞానమునకు మనం ప్రత్యేకించి గ్రంథములు చదవనక్కర లేదు. ఏ పెద్దలను ఆశ్రయించనక్కర లేదు. ఏ బోధలు వినక్కరలేదు. ప్రజ్ఞానం ఆకోశమై ఉంటున్నాది మనయందు. ఈ ప్రజ్ఞానమయ కోశాన్ని మనం అనుభవించినప్పుడు ఆనందమయకోశం మనకు సహజంగానే లభ్యమవుతుంది. కనుక మానవుడు నిరంతరము ఆనంద పిపాసియై ఉంటున్నాడు. ఆనంద సాగరములో తేలి ఆడుతున్నాడు. ఆనందసాగరములోనే పుట్టాడు. కనుక మన birth, నివాసము, death అన్నీ ఆనందములోనే జరుగుతున్నవి. జనన, మరణ

sri sathyasai vachanamrutam

నిధిధ్యాసములన్నీ ఆనందములోనే జరుగుతున్నాయి.

**ఆనందం మనలోనే ఉంది**

**నీటియందే పుట్టి నీటియందె పెరిగి**
**నీటియందడంగు నీటిబుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు**

ఆనందము మనలోనే ఉంది. ఆనందం కోసం ఎందుకు ప్రాకులాడటం. ఎందుకు మీరింత ప్రయాణములు చేయటం. ఎందుకింత ధనము వ్యయం చేయటం. దేశకాల పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని కాలకర్మ కారణ కర్తవ్యాలను కూడా వ్యర్థము చేసుకుంటున్నారు. నిజంగా మానవుడు ఎక్కువ కాలమును వ్యర్థము చేస్తున్నాడు. దినమునకు 24 గంటల సమయముంటున్నాది. కానీ 24 గంటల సమయంలో 20 గంటలు వ్యర్థం చేస్తున్నాడు. ఏదో మన పనులని మనం భావించుకుంటున్నాం. మన ఉద్యోగములను నెరవేరుస్తున్నాం. మన business అని ప్రవేశిస్తున్నాం. ఇవన్నీ వ్యర్థమైన పనులే. ఇవి నిజమైన సార్థకతకు చిహ్నము కాదు. ఈ 24 గంటలలో మిగిలిన 4 గంటలుంటున్నాయి. దీనిని మరింత సోమరితనములో వ్యర్థము చేస్తున్నారు. ఒక్క క్షణమైనా మానవుడు తనతత్వాన్ని తాను ప్రశ్నించుకోటం లేదు. నేను ఎందుకోసం పుట్టాను. ఎందుకోసం వచ్చాను. ఏమి చేస్తున్నాను. అనే ప్రశ్నలే లేవు. ఎవరైనా ఎదుటివారిని చూసే సరికి నీవు ఎవరయ్యా? ఎందుకోసం వచ్చావయ్యా? ఏమి చేస్తున్నావు? అని ప్రశ్న వేస్తున్నాము. బయటవారిని ప్రశ్నించే శక్తి మనలో ఉంటున్నాది గానీ మనలను ప్రశ్నించుకునే శక్తి పూర్తిగా మర్చిపోతున్నాం. నేను ఎందుకోసం వచ్చాను. ఎక్కడ నుండి వచ్చాను. ఏమి చేస్తున్నాను అని ప్రశ్నలు తాను వేసుకుంటే అప్పటికప్పుడే జవాబు చెబుతుంది.

నా జన్మము యొక్క ప్రభావము, నా జన్మము యొక్క సార్ధకత యిలాంటిదనే సత్యాన్ని గుర్తించాలి. Purpose of life మనకు తెలియకుండాపోతే యింక మనం ఏమి చేస్తున్నట్లు. What is the purpose of life. హిందీలో చెబుతారు. ఖానా పీనా సోనా మర్నా అని.

sri sathyasai vachanamrutam

నాల్గింటికోసమే మనం పుట్టామా? యిదా మన purpose. కాదుకాదు. దేహము ఎందుకోసం పుట్టింది? 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం.' ధర్మాన్ని అనుసరించే కోసం పుట్టింది. ఏమిటి మన ధర్మము. తన సత్యాన్ని తాను గుర్తించాలి. ఎదుటి వ్యక్తిని దైవంగా విశ్వసించాలి. ప్రపంచమంతా దైవమందిరంగా భావించాలి. ఏ పనిచేసినా దైవకార్యంగా విశ్వసించాలి. సర్వకర్మలు భగవత్ప్రీత్యార్థముగా భావించాలి. పలికిన పలుకంతా మంత్రంగా విశ్వసించాలి. ప్రతిపదము ప్రదక్షిణగా భావించాలి. ఇలాంటి పవిత్రమైన భావములతో ఉండవలసిన మానవుడు ఈనాడు అపవిత్రమైన జీవితాన్ని గడుపుతూ ఏదో ఆర్జించాలనే ఆశల చేత జీవితాన్ని వ్యర్థము చేసుకుంటున్నాడు. ఏమిటి ఆర్జిస్తున్నాడు? ఏమీ లేదు. జీవితము అంటే ఏమిటి? జీవితం. జీ-వి-త. ఈ మూడు పోయినాయి. చివరి సున్నా మాత్రమే మిగిలింది మనకు. ఈ జీరో కోసం జీవించటమా? కాదు నీవు హీరో కావాలి. జీరో ప్రక్కనే ఉంటున్నాది హీరో. ఈ zero కు left side న ఒకటి పెడితే 10 అవుతుంది. దాని ప్రక్కన మరొక జీరో పెడితే 100 అవుతుంది. యింకో జీరో పెడితే 1000. కనుక హీరోను మనం లక్ష్యమునందుంచుకొని నా దేహము, నా బుద్ధి, నా చిత్తము, నా ఇంద్రియములు, నా అంతఃకరణ యివన్నీ ఎన్నైనా జీరోలుగా పెట్టుకోండి. Hero becomes zero if he forgets God. దైవాన్ని మరచిన తరువాత zero అవుతాడుగానీ హీరో కాదు. మనము హీరోను ఆధారముగా తీసుకోవాలి. ప్రపంచమంతా జీరోయే. జీవితమంతా జీరోయే. ఆకాశమంతా జీరోయే. సూర్యచంద్రాదులు జీరోలే. అన్నీ జీరోలే. హీరో వల్లనే జీరోలు ప్రకాశిస్తున్నాయి. కనుక మన జీవితమును మొట్ట మొదట గుర్తించుకోవటానికి ప్రయత్నంచేయాలి. మనం సేవలో ప్రవేశించాలి. ఎవరికి చేస్తున్నావు సేవ. ఎవరికో చేస్తున్నానని భావించరాదు. నీకు నీవే చేసుకుంటున్నావు. భగవంతుని పూజిస్తున్నావు. ఎందుకు పూజిస్తున్నావు? నీ తృప్తి కోసం పూజిస్తున్నావు. నీవు చేసే భజనలు గానీ, నీవు చేసే పూజలు గానీ, నీవు చేసే ధ్యానముగానీ నీవు చేసే జపముగానీ భగవంతుని కోసమే కాదు. యిదంతా నీ తృప్తి కోసం నీవు చేస్తున్నావు. భగవంతునికి యివేమీ అవసరం లేదు. భగవంతునికి కావలసింది ఒక్కటే. నిన్ను నీవు తెలుసుకో. అప్పుడే నన్ను నీవు తెలుసుకున్నవాడౌతావు. Confidence in you. Confidence in god. This is the secret of greatness. ఈ greatness ని

sri sathyasai vachanamrutam

మనం గుర్తించుకోవాలి. నిన్ను నీవు నమ్మలేకపోతున్నావు. ఇంక భగవంతుని ఎట్లా నమ్మగలవు? నాలుగు దినాలు బ్రతకవలసిన నరునిపై నీకు నమ్మకము లేదు నారాయణునిపై నమ్మకము ఎట్లా వస్తుంది? కేవలం నారాయణుని నమ్మినవాడు ప్రహ్లాదుడు. నరదేహమును నమ్మినవాడు హిరణ్యకశిపుడు. నారాయణుని నమ్మలేదు. అట్టి నమ్మినవారికి ఎట్టి పరిస్థితులయందు దైవరక్షణ కల్గుతూనే ఉంటుంది.

ప్రేమస్వరూపులారా!

**ప్రేమచే దేనినైనా సాధించవచ్చును**

మీరందరు ప్రేమస్వరూపులే. ఎందుకంటే ప్రేమ మీయందుంటున్నాది. You are the embodment of love. You are the embodment of peace. You are the embodiment of God. నీవే దైవము. నీవే సత్యము. నీవే ప్రేమ. నీవే శాంతి. అంతా నీవుగానే ఉంటున్నావు. నీలోనున్న శాంతిని, నీలోనున్న ప్రేమను బయట ప్రపంచములో వెతకటానికిపోతే ఎక్కడ చిక్కుతుంది? ఈనాటి మానవుని అజ్ఞానం ఎట్లా ఉందంటే దైవాన్ని బయట ప్రపంచములో వెతుకుతున్నావు. ఎక్కడా బయట ప్రపంచములో చిక్కదు. శాంతి కావాలని ప్రపంచమంతా తిరుగుతున్నాము. దేవాలయములు తిరుగుతున్నాము. అనేక యాత్రలు చేస్తున్నాం. యాత్రా స్థలములలో peace లేదు. బయట ప్రపంచములో peace లేదు. ఎక్కడ చూచినా pieces no peace. Where is peace. Peace is in you with you. నీలోనే ఉంటున్నాది ఆ శాంతి. దాన్ని నీవు లోపల వెతుకు. అప్పుడే శాంతి లభ్యమవుతుంది. దాన్ని పొందే మార్గము ఏమిటి? అదియే ప్రేమ మార్గము. ఆ ప్రేమ పవిత్రమైన ప్రేమగా అభివృద్ధి పరచుకున్నప్పుడే ఏమైనా సాధించవచ్చును. ఆ ప్రేమయే దైవము. God is Love live in Love. ఈ ప్రేమచేత మనం ఎంతైనా సాధించవచ్చు. ప్రేమలేని సమయంలో దేనిని నీవు సాధించలేవు. ప్రేమచేతనే దైవత్వాన్ని నీవు పొందాలి. ప్రేమచేతనే నిన్ను నీవు తెలుసుకోవాలి. ఈ ప్రేమ కోసం ఎవరివెంట పడనక్కర లేదు. ఎక్కడా నీవు శ్రమించనక్కరలేదు. నీ దృష్టి నీవు అంతర్ముఖము గావించుకో. అప్పుడు నీకు సరైన ప్రేమతత్వము చిక్కుతుంది. అందరు భగవంతుని అంశములుగా భావించాలి. ఆ పరమసత్యాన్ని గుర్తించే నిమిత్తం **'మమైవాంశో జీవలోకే జీవభూత స్సనాతనః'** అని

srisathyasaivachanamrutam

బోధించారు. ప్రప్రథమంలో మనం చేయవలసింది యిదే. అందరూ దైవాంశ స్వరూపులే. కాబట్టి ఎవరికి సేవచేసినా దైవసేవగా భావించాలి. ఆవిధంగా మనం భావించి The best way to love God is to love all and serve all. అందరిని ప్రేమించు. అందరిని సేవించు. ఈవిధంగా ఉంటే సర్వకర్మ భగవత్ప్రీత్యర్థమై పోతుంది.

**కోరికలే దుఃఖ కారణము**

ప్రేమస్వరూపులారా! మనకు కావలసినది దేహానికి యింత అన్నం కావాలి. ఆహారం కావాలి. ధరించటానికి వస్త్రం కావాలి. ఉండటానికి ఒక కొంప కావాలి. అంతో యింతో రోగము వస్తే మందు త్రాగటానికి డబ్బు ఉండాలి. ఇంతేగాని మితిమీరిన ఆశలకు గురౌతున్నాం. ఎంతవరకో అంతవరకే. తృప్తి పడాలి. ఈ తృప్తియే సుఖము. అసంతృప్తి వల్ల రెండు విధాల నష్టమైపోతుంది. నీకు నీవు శాంతిని పొందాలంటే తృప్తి నీవు అనుభవించు. ఈ తృప్తి కూడా ఎక్కడో లేదు. నీయందే ఉంటున్నాది. మానవుడు కోరే సర్వ కోరికలు దుఃఖమునుండే వస్తున్నాయి. కోరికలన్నింటికి birth place దుఃఖమే. ఈ కోరికలనుండి వచ్చిన దుఃఖమును భరించుకోలేకపోతున్నాం. ఎందువల్ల మన desires నుండే వస్తున్నాది దుఃఖము. కనుక less luggage more comfort Such travel is a pleasure. ఈ desires ను మనం తగ్గించుకుంటూ రావాలి. దానినే వైరాగ్యమన్నారు. desires వైరాగ్యమునకు మార్గం చూపించదు. భౌతిక జగత్తంతా జడము అని భావించు. సూక్ష్మమైన జగత్తంతా మాయగా విశ్వసించు. అతి సూక్ష్మమైన జగత్తంతా ప్రతి బింబముగా విశ్వసించు. అన్నింటికి బింబము. అది ప్రతిబింబమే. యిది జడమే. యిది మాయనే. ఈ మూడింటిని యీ రకంగా భావించినప్పుడు యింక కోరికలే రావు. మనం క్రమక్రమేణా కొన్ని ఆశలు తగ్గించుకుంటూ రావాలి. ఈ ఆశలు తగ్గించుకుంటూ వచ్చినప్పుడే దైవాశ పెరుగుతూ పోతుంది. వేదము కూడా దీనినే ప్రబోధించింది.

**అవినీతి ఉంటే అమృతత్వముండదు**

**'నకర్మణా నప్రజయా ధనేను త్యాగేనైకే అమృతత్వమానసుః'.** ఎట్టి కర్మలు చేసినప్పటికిని, అవి భగవత్ప్రీత్యార్థంగా చేయి. ఎంత సంతానము ఉన్నా భగవంతునికి

sri sathyasai vachanamrutam

అర్పితము గావించు, ధనమును భగవంతుని gift గా నీవు విశ్వసించు. దాన్ని కూడా సద్వినియోగపరుచుకో అప్పుడే నీకు అమృతత్వము చిక్కుతుంది. త్యాగము మానవునియందు లేనంతవరకు అనృతత్వమే ప్రాప్తిస్తుంది. అనృతత్వమనగా false. అమృతత్వమనగా శాశ్వతము. అదే immortality అన్నారు. ఎట్లా లభ్యమవుతుంది immortality. What is the way to immortality? removal of immorality is the only way to immortality. కామము, క్రోధము, లోభము, మోహము యివన్నీ తీసివేసినప్పుడు immortality వస్తుంది. అది లేకుండా నాకు అమృతత్వం కావాలంటే ఎట్లా చిక్కుతుంది. ఈ పాత్రలో నీరున్నాది.

**ఏమి లేని పాత్రలోన ఏమైనా నింపవచ్చు**
**ఏమేమో నింపియున్న పాత్రయిది ఖాళీయగునా**
**పాత్ర అది ఖాళి కాక యిల సుకృతము నింపనగునా**

వీలుకాదు. ఏమేమో నింపుకున్నావు హృదయంలో. ఏమీ లేని పాత్రలో ఏమైనా నింపవచ్చు. అప్పుడే నీవు దైవత్వాన్ని సంపూర్ణంగా నింపుకోవచ్చు. ఒక్క చుక్క కూడా వేయటానికి స్థలము లేదు యీ పాత్రలో. అంతా ప్రాపంచిక చింతలతో full గా నింపుకున్నారు. ఆ చింతా, యీ చింతా మానవునికి ఎన్ని చింతలుంటున్నాయి.

**పుట్టుట ఒక చింత భూమినుండుట చింత**
**సంసారమొక చింత చావు చింత**
**బాల్యమంతయు చింత వార్ధక్యమొకచింత**
**జీవించుటొకచింత చెడుపుచింత**
**కర్మలన్నియు చింత కష్టంబు లొక చింత**
**సంతసమొక చింత వింత చింత**

యిన్ని చింతలన్నీ ఉన్న మానవునికి సంతోషమెట్లా చిక్కుతుంది? ప్రతిదానికి మానవుడు చింత పడుతున్నాడు. పెండ్లి చేయాలంటే చింత. ఆదాయం రావాలంటే చింత. అన్నింటికిని చింతనే పడుతున్నాడు. నీ జీవితమంతా చింతతోనే నిండినప్పుడు సంతోషం ఎక్కడ చిక్కుతుంది. చాలా అపవిత్రమైన జీవితము. ఇంత పవిత్రమైన మానవజన్మ ఎత్తికూడనూ

sri sathyasai vachanamrutam

మనం అపవిత్రమైన జీవితాన్ని గడుపుతున్నాము.

**ఆనందం ఇతరులకు మేలు చేయడంలోనే ఉంది**

ఏ కించిత్తైనా ఉపకారము చేస్తున్నావా? ఏ కించిత్తైనా త్యాగము చేస్తున్నావా? ఏ కించిత్తైనా పదిమందికి మేలు చేస్తున్నావా? లేదు. దీనినే 18 పురాణములలో రెండు సూక్తులుగా చెప్పాడు వ్యాసుడు.

**అష్టాదశ పురాణేషు వ్యాసస్య వచన ద్వయం**
**పరోపకారః పుణ్యాయ పాపాయ పరపీడనమ్.**

Help ever hurt never ఈ రెండు చూసుకుంటే చాలు. నీవు పుణ్యము చేయటానికి వీలు లేకపోయినా ఊరికే కూర్చో అదే పెద్ద పుణ్యము. పాపం చేయవద్దు. help చేయటానికి వీలుకాకపోతే ఊరకే ఉండు. hurt చేయకూడదు. ఎవరిని మనం hurt చేయకూడదు. ఎలాంటి పరిస్థితిల్లోనూ hurt చేయకూడదు. అప్పుడే నీకు సరైన ఆనందము లభ్యమవుతుంది. మానవుడు చేయవలసిన పని ఏమిటి? ఎప్పుడు help help. దీనిలో ఎంతో ఆనందముంటున్నాది. సహాయం. ఎలాంటి సహాయం heart to heart love to love. ఏదో పేరు ప్రతిష్ఠల కోసం చేయకూడదు. హృదయపూర్వకంగా చేయాలి. ఏ చిన్నది చేసినా హృదయ పూర్వకంగా చేయి. ఈ సత్యాన్ని మనం మొట్టమొదట గుర్తించి జీవించటానికి ప్రయత్నించాలి.

ప్రేమస్వరూపులారా! ఎన్ని సాధనలు చేసినప్పటికిని మొట్టమొదట నీయందున్న దివ్యతత్వాన్ని గుర్తించుకొనక యీ సాధనలు ఎన్నిచేసి ప్రయోజనం లేదు. ఈనాడు చేస్తున్నాడు గానీ ప్రయోజనం ఏమిటి?

**మేధమేటిక్సును మరువక జపియించు**
**గణితశాస్త్రము వంక చూడబోడు**
**అమెరికా మార్గంబు నరయ జూచును గాని**
**కాశికా మార్గంబు కానరాదు**
**ఆల్జీబ్రాయంతను అరసి చూచును గాని**

sri sathyasai vachanamrutam

**ఇంటి వైశాల్యంబు నెరుగబోడు**
**వృక్షశాస్త్రంబు నెరుగు సమృద్ధిగా తులసి**
**ఉపయోగ మెరుగడు మానవుండు.**

ఏమిటి ఉపయోగం. యిలాంటి జీవితాన్ని గడుపుతున్నాడు మానవుడు. ఏది జీవితానికి ఆదర్శమో దాని, విడచిపెడుతున్నాడు. అనవసరమైన దానిలో ప్రవేశిస్తున్నాడు. చేయవద్దు. నీవు చేయవలసినది నీ నిజతత్వాన్ని నీవు గుర్తించు. హృదయమును మించిన స్థానము మరొకటి లేదు. ఎక్కడ చూచినా హృదయమే ఏమిటి? హృత్ + దయ. దయతో కూడినది హృదయము. కరుణతో కూడినది హృదయము. compassion తో కూడినది హృదయము. ఆ compassion మనలో ఎక్కడుంది? fashion మారుతున్నాది గానీ compassion లేదు. ఏమిటి యీ fashion. యిదా జీవితమునకు fashion. Compassion ఉంటే అదే నిజమైన fashion. ఆ compassion మనం పెంచుకోవాలి. Mankind ను మనం అభివృద్ధిపరచుకోవాలి. Mankind అంటే ఏమిటి? Kindness పెంచుకోవాలి. Man కి ఉండవలసినది kindness. ఆ kindness లేకపోతే man కాదు రాక్షసుడు. ఈనాడు రాక్షసులైనా కొంచెం kindness చూపుతున్నారు. కానీ యీనాటి మానవునియందు ఆ kindness కనిపించటం లేదు. యింక ప్రయోజనం ఏమిటి?

**మాటలు, భావనలు, చేష్టలు పవిత్రంగా ఉండాలి**

Mankind. పిచ్చి పిచ్చి యింగ్లీషు పదాలు ఉపయోగపెడుతున్నాం. ఈ యింగ్లీషు ఎక్కడ ఏమి పలకాలో ఏమిటో తెలియదు. ఎక్కడెక్కడ ఏ పదములు ఉపయోగపెట్టాలో తెలియదు. ఇష్టము వచ్చినట్లుపోతుంది. Put పుట్ అంటుంది. but బట్ అంటుంది. ఇలాంటి language తో ఎంతనో పాడైపోతున్నాం. మన భారతీయ language సంస్కృతం. అదే పవిత్రమైన, మధురమైన భాష. అదే క్షీరసారం. పలుకులందు మృధుమధురంగా ఉంటాయి. అప్పుడే మానవుని హృదయం compassion గా ఉంటుంది. You cann't always oblige but you can speak always obligingly. అప్పుడే compassion. అలాంటి పలుకులలో ప్రేమ లేక పోయినప్పుడు పలికి ప్రయోజనం ఏమిటి?

srisathyasaivachanamrutam

ప్రతి మానవుడు తన చర్యలందుగానీ, తన మాటలందుగానీ, తన చేష్టలందుగానీ, కర్మలందుగానీ పవిత్రమైన జీవితాన్ని గడపాలి. దానినే the proper study of mankind to man అన్నారు. ఈ mankind అంటే హృదయము, వాక్కు, పని. ఈ మూడింటి ఏకత్వమే. హృదయములో ఏది ఉద్భవిస్తున్నాదో దాన్ని వాక్కులో చెప్పాలి. ఏది వాక్కులో చెప్పావో అది చేత్తో చేయాలి. ఈనాడు హృదయములో భావించేది ఒకటి, నోటితో చెప్పేది మరొకటి, చేత్తో చేసేది యింకోటి.

**మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్,దురాత్మనమ్**
**మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్**

మీరందరు మహాత్ములు కావాలి. మహత్తరమైన మానవజన్మ లభించింది మనకు. ఈ జన్మ చాలా పవిత్రమైనది. జంతూనాం నరజన్మ దుర్లభం అన్నారు. ఈ మానవ జన్మకున్న విలువ మరిదేనికీ లేదు. మానవజన్మకున్న కీర్తి మరొకదానికి లేదు. మానవజన్మకున్న స్థాయి మరొకటి లేదు. ఈ విధమైన మానవజన్మ ఎత్తి ఎంత నిరర్థకం చేసుకుంటున్నాం.

**భగవత్స్మరణలోనే ఆనందముంది**

ప్రేమస్వరూపులారా! జీవితమంతా ప్రేమతోనే ధారపోయండి. ప్రేమచేతనే జీవించండి. ఆనందమును అనుభవించండి. ఆనందాన్ని పంచండి. ఆనందాన్ని అనుభవించండి. ఆనందతత్వాన్ని మనం పొందాలి. ఎప్పుడు చూచినా ఆనందంగానే ఉండాలి. ఒకానొక సమయంలో ఒక భక్తుడు భగవంతుని ప్రార్థించాడట. భగవంతుడా నీకు 24 గం॥లు ఉంటున్నాది టైము. కానీ నీకు ఎక్కడ వ్యవధి చిక్కుతున్నాది. ఎంతమందో ఎన్ని అప్లికేషన్లో వేస్తున్నారు. అది కావాలని ఒకటి యిది కావాలని ఒకటి. అన్ని కోరికలు నీకు అప్లికేషనుగా ఇస్తున్నారు. ఇవన్నీ ఎప్పుడు మీరు చూస్తున్నారు? ఎప్పుడు మీరు జవాబిస్తున్నారు? ఎక్కడ వ్యవధి ఉంటున్నాది మీకు? యింత వ్యవధిలోపల ఎంత ఆనందంగా ఉంటారు. మేము రెండు జాబులు చూసేటప్పటికి తలనొప్పి వస్తుంది. యిన్ని చదువుకుంటూ, యిన్నింటికి జవాబు యిస్తూ యింత ఆనందమును అనుభవిస్తున్నారంటే యిదే దైవత్వానికి మూలకారణం. అదే happiness is union with god. యిది నీ

sri sathyasai vachanamrutam

ఆనందమని నేను చెప్పుకోటం లేదు. మీ ఆనందమును మీకిచ్చే కోసమని ప్రాకులాడుతున్నాను. చాలామంది birthday వస్తే happy birthday అంటారు. happy లేని వానికి happy చెప్పండి. నేను ఎప్పుడు happy గానే ఉంటాను. గాన happy చెప్పనక్కరలేదు. మీకు మీరు ఆనందాన్ని పెంచుకోవాలి. be happy. నీవు మరొకరికి అందించటానికి ప్రయత్నం చేయకు. ఈవిధమైన ఆనందాన్ని మొట్టమొదట గుర్తించటానికి ప్రయత్నించాలి. ఈ ఆనందము ఏ పదార్థములోను లభించదు. ఏ కార్యముచేత లభించదు. ఏ సాధనలచేత లభించదు. ఏవిధమైన మార్గములో మనకు లభించదు. ఒక్క దైవప్రేమచేత ఈ ఆనందము లభ్యమవుతుంది. ఆ ప్రేమయందే సర్వము ఆవిర్భవిస్తున్నాది. దైవాన్ని ప్రేమించిన వానికి ఏనాటికి చెడుపు లేదు. అదే ఒక అబ్బాయి చెప్పాడు.

**నమ్మక చెడిన వారలున్నారు గాని**
**నమ్మి చెడినట్టివారు ఈ లోకాన లేరు లేరు లేరు**

నమ్మకయే యిన్ని అవస్థలకు గురౌతున్నారు మానవులు. దైవాన్ని నమ్మకపోతే మాను, కనీసం తనను తాను నమ్మాలి కదా. తనను తాను నమ్మలేని పరిస్థితిలో ఉంటున్నాడు యీనాటి మానవుడు. యింక వీనికి ఆనందము ఎక్కడనుండి వస్తుంది. ఏ post నుంచి వస్తుంది. ఏ టెలిగ్రాము నుండి వస్తుంది. ఏ బంధువుల నుండి వస్తుంది. ఏమీ లేదు. ఈ ఆనందము తననుంచే ఆవిర్భవించాలి. ఈ ఆనందానికి ప్రేమతత్వాన్ని పెంచుకోవాలి. ప్రేమ ఒక్కటి ఉంటే మనం పొందలేనిది ఏమీ లేదు. Every thing is there. ఇలాంటి ప్రేమ మనము ఈనాడు మర్చిపోయాం. లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన ప్రేమకోసం ప్రాకులాడుతున్నాం. యిదంతా ప్రవృత్తి లక్షణాలే. నిజమైన ప్రేమ నివృత్తి లక్షణమే. నివృత్తి నుండే ఆవిర్భవిస్తుంది యీ love. భగవంతునికి అర్పితం కావాలి. ఏవిధంగా అర్పితం కావాలి.

**శరణాగతి పొందండి**

**ఏ హృదయంబు నొసగితివో ఈశ నాకు**
**మగిడి దానినే అర్పింతు నీ పాదార్చనకు**



sri sathyasai vahini amrutam

**పరగ వేరేమితెత్తు నీ పాదార్చనకు**
**అంజలి ఘటింతు అందుకొనవయ్య**

ఆవిధంగా surrender కావాలి. నీ హృదయపాత్రలోని నీరు సముద్రంలో ఏవిధంగా కలిపినావో నీ హృదయమునందున్న ప్రేమ భగవత్ప్రేమతో లీనం చేయి. రెండు ఏకమైపోతాయి. ఏకత్వమే నిజమైన ఆనంద తత్వము. ఏకత్వములోనే చాలా ఆనందముంటున్నాది. చిన్న ఉదాహరణ. అందరు ఐకమత్యంగా ఉండాలి. యిద్దరన్నదమ్ములు వాలి, సుగ్రీవులు. యిద్దరు ఐకమత్యము లేక ఎన్ని అవస్థలకు గురయ్యారు. యింక రావణుడు, కుంభకర్ణుడు, విభీషణుడు వీరు ముగ్గురు ఒక తల్లి బిడ్డలే. కానీ వీరిలో ఒకరితో ఒకరికి ఐకమత్యము లేదు. అనేక అవస్థలకు గురైపోయారు. పాండవులు ఐదుమంది ఉంటున్నారు. పాండవులలో ఒకరికి ఒకరికి కలతలు వచ్చినప్పటికిని ఐకమత్యము వీడలేదు. కానీ అందరు ఐకమత్యంగా జీవిస్తూ వచ్చారు. కనుక వారి కీర్తి జగత్ వ్యాప్తి గావించింది. ఐకమత్యముచేత ఎంతైనా మనం సాధించవచ్చు. ఈనాడు మన భారతదేశములో 95 కోట్ల మంది జనులుంటున్నారు. అందరు ఒక్కటైపోతే ఈ దేశాన్ని ముట్టే వారే లేరు. అంతా స్వర్గంగానే మార్చుకోవచ్చు. ఎక్కడుంది ఈ unity అంతా enimity, enimity. Unity లేదు, Purity లేదు, Divinity లేదు. అందులో స్థలము ఖాళీగా ఉండటం చేత enimity పోయి కూర్చుంటున్నాది. సీటు ఖాళీగా ఉన్నాది. దానిలో కూర్చుని ఆనందము అనుభవిద్దామని enimity పోయి చేరిపోతుంది.

**ద్వేషాన్ని పెంచుకోకండి**

ఈనాటి మానవుడు enimity కి హృదయంలో స్థానం యిస్తున్నాడు గానీ ప్రేమకుగానీ, యూనిటీకి గానీ, డివినిటీకి గానీ హృదయంలో స్థానం యివ్వటం లేదు. మొట్టమొదట మానవుడు హృదయములో స్థానము యివ్వవలసినది ప్రేమకే, దైవప్రేమకే. ఈ హృదయమనే సీటు ఒక single seat, double seat కాదు. Not musical chairs. ఒకే chair. ఆ chairలో దైవప్రేమను కూర్చోబెడితే ఎవరు దగ్గరకు రావటానికి వీలు లేదు. అందరు దానిని అనుసరిస్తూ పోతుంటారు. అప్పుడే దానికి తగిన కీర్తి వస్తుంది.

srisathyasaivachanamrutam

మానవుడుగా పుట్టినందుకు, మానవుడుగా పెరిగినందుకు, భక్తునిగా జీవించినందుకు త్యాగానికి మనం పూనుకోవాలి. కానీ యీనాటి భక్తి చాలా artificial గా ఉంటున్నాది. ఏమిటి యీ artifical devotion. బయట ఒకటి, లోపల మరొకటి. సరైనదే కాదు. తనను తాను మోసం చేసుకున్నట్టుగా ఉంటుంది. తన దాన్ని తాను కాపాడుకోవాలి. తన గౌరవము తాను నింపుకోవాలి. తన మానవత్వాన్ని తాను సంరక్షించుకోవాలి. ఇలాంటి మానవత్వముతో కూడిన జీవత్వము ఎక్కడ లభించదు. ఎన్ని జన్మల పుణ్యమో యీ మానవత్వము మనకు ప్రాప్తించింది. అందరికి లభించేది కాదు.

**కష్టము లేక సుఖము లేదు**

ఈ కష్టములలో సుఖము కూడి ఉంటున్నాది. ఎవరి ఖర్మ వారు అనుభవించక తప్పదు కానీ ఎవరి పుణ్యము కూడా వారు అనుభవించక తప్పదు.

**రాముడంతటి వాడు రమణి సీతను బాసి**
**పామరుని వలె ఏడ్చెనన్నా**
**ఏనాడు ఏ తీరు ఎవరు చెప్పగలరు**
**అనుభవించుట సిద్ధమన్నా**
**అలనాటి పాండవులు ఆకులలములు మేసి**
**అడవిపాలై పోయిరన్నా**

ఆ కష్టముల చేతనే సుఖము లభించింది వారికి. కనుక కష్టము లేక సుఖము మనకు ఏనాటికి లభ్యము కాదు. కష్టమునకు మనం సిద్ధముగానే ఉంటుండాలి. కష్ట సమయములో సుఖాన్ని మనం చింతిస్తూ రావాలి. సుఖము అని ఆశిస్తూ రావాలి. ఈనాడు అమావాస్య అనుకుంటే అయ్యో అమావాస్య వచ్చిందే అని చింతించరాదు. రేపటి దినము నుండి పౌర్ణిమ దినములు start అవుతుంది. అమావాస్య లేక పౌర్ణిమ రావటానికి వీలుకాదు. కనుక మన కష్టములలో సుఖము ఉంటున్నాది. **న సుఖాత్ లభ్యతే సుఖమ్.** సుఖమునుండి సుఖము లేదు. కష్టము నుండే సుఖము వస్తుంది. మనము సుఖము నుండి సుఖము పొందాలని ఆశిస్తున్నాం. చాలా పొరపాటు. Pain నుండి మనం pleasure



srisathyasaivachanamrutam

అనుభవించాలి. కనుక ప్రేమచేతనే మనం భగవంతుని పూజించి, ధ్యానించి, ఆరాధించి ఈ ప్రేమతత్వాన్ని మనం పొందటానికి ప్రయత్నించాలి.

**సాధుసంగమం సకలార్థ సాధకం**

అయితే నీవు కూడా ప్రేమస్వరూపుడైనప్పటికి ఆ దివ్యత్వాన్ని నీవు గుర్తించేంత వరకు ఈ మార్గాన్ని మనం అనుసరించవలసిందే. ఈ సాధనలు మనం చేయవలసిందే. నీవు బెంగుళూరు పోవాలని ప్రయాణమైనావు. బెంగుళూరు పోయేంత వరకు నీ ప్రయాణము సాగవలసిందే. బెంగుళూరు పోయిన తరువాత నీ ప్రయాణము నిలిపివేయి. అంతవరకు మాత్రం సాధన చేయవలసిందే, సేవలు చేయవలసిందే. గ్రామ సేవలలో మనం పాల్గొనవలసిందే అన్నింటియందు మనం ఉండవలసిందే. ఈనాడు కొంతమంది చెబుతుంటారు. ఈచిన్న వయస్సునందు ఎందుకీ భక్తి ప్రపత్తులు అంతా. రిటైరు అయిన తర్వాత భగవంతుని స్మరించవచ్చు అని. ఏమిటి అప్పుడు చేస్తారా!

**పదపదమంచు కింకరులు పాశము లాగెడు వేళ**
**దబదబ బయట పెట్టుడిక లాభములేదని చెప్పువేళ**
**లబలబ భార్యబిడ్డలు ఏడ్చువేళ**
**తరమా హరినామము స్మరియింప ధరన్**

అప్పుడా మనం చింతించేది. అప్పుడు సాధ్యమవుతుందా? Start early, drive slowly, reach safely. ఆవిధంగా చేసుకోవాలి గానీ రిటైర్ అయిన తరువాత స్మరిస్తానంటే రిటైరైన తర్వాత ఏమౌతావో ఉద్యోగము టైములో చేయలేనప్పుడు రిటైర్ అయిన తర్వాత ఏమి చేస్తావు? అందుకోసమే మిలట్రీలో మొట్టమొదట (రిక్రూట్‌మెంటు) అని పెడతారు. మొట్టమొదట సైన్యములో ప్రవేశించిన తరువాత ఆ (రిక్రూట్‌మెంటు) మనం ప్రయత్నపూర్వకంగా సాధన చేయాలి. అది అయిన తరువాత నీకు తుపాకి యిచ్చి ముందుకు పంపుతాడు. ఆ యుద్ధము చేయటానికి పురికొల్పుతాడు. ఎవరితో యుద్ధము.

sri sathyasai vachanamrutam

మనము దుర్మార్గముతో యుద్ధము చేయాలి. దుష్టగుణములతో యుద్ధము చేయాలి. అప్పుడే మన సత్సంగము, సత్ప్రర్తన మనలో అభివృద్ధి అవుతుంది. దుస్సంగమే మనం చేయకూడదు. Run away from bad company. అప్పుడే మన జీవితము సార్థకమవుతుంది. మన సాంగత్యములో మన మంచి చెడ్డలు కూడా ఉంటున్నాయి. Tell me your company I shall tell you what you are నీవు ఎలాంటి కంపెనీలో ఉంటావో అలాంటి తత్త్వాన్ని పొందుతావు.

ప్రేమస్వరూపులారా! సత్సంగాన్ని చేరండి. సత్ప్రవర్తనలో మునగండి. సత్కర్మలు సలపండి. సన్మార్గములో ఉండండి. సచ్చింతన చేయండి. సర్వేశునిలో లీనం కండి.

**(తేదీ 28-09-1998న కుల్వంత్ హాల్‌లో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam